పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్,అక్టోబర్ 18: నవంబర్ 17,18 తేదీల్లో జరగనున్న గ్రూపు-3, డిసెంబర్ 15న గ్రూప్ 2 పరీక్షల కోసం జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి గ్రూప్ 2,3 పరీక్షల ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీజినల్ కోఆర్డినేటర్లు, పోలీస్‌నోడల్ అధికారులను నియమించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలో గ్రూపు 3 పరీక్ష నిర్వహణకు 13500 మంది అభ్యర్థుల కోసం 37 కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ను గుర్తించడం జరిగిందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట ఏసీపీ మధు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

కొమురవెల్లి, అక్టోబర్ 18 : ప్రభుత్వం వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల పత్తి రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారని వాపోయారు. వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడి లేక కొద్దిపాటి పత్తిని అమ్మకుందామనుకుంటే ధర లేక రైతులు ఆగమైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సీసీఐ పత్తి కేంద్రాలు ప్రారంభించాలని, లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాయకులు బి.కృష్ణారెడ్డి, రాంగసార్ మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, తేలు ఇస్తారి, బక్కేల్లి బాలకిషన్, తాడూరు భరత్, నీల భిక్షపతి, సార్ల యాదయ్య, సున్నం యాదగిరి, ఎల్లయ్య, శ్రవణాచారి, ఆరుట్ల రవీందర్, మల్లయ్య పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన గీత కార్మికులు

హైదరాబాద్ తరలివెళ్తున్న ఆకునూరు గ్రామ గీత కార్మికులు

చేర్యాల, అక్టోబర్ 18 : గీత కార్మిక సంఘం 67 వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన వార్షికోత్సవ సభకు చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల నుంచి గీత కార్మికులు భారీగా తరలివెళ్లారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకుని హైదరాబాద్‌కు తరలివెళ్లి తమ హక్కుల సాధన కోసం కార్మిక సంఘం చేస్తున్న కృషిని అభినందించారు.తరలిన వారిలో కల్లు గీత కార్మిక సంఘం మండల, గ్రామాల బాధ్యులు, కార్మికులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మర్కూక్, అక్టోబర్18: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా ఇస్తున్నదని బీఆర్ఎస్ నాయకులు పాండు గౌడ్, రామచంద్రం,బాల్‌రెడ్డి అన్నారు.శనివారం మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన దాడి రవికి మంజూరైన రూ.15500 సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఉపయోగపడుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డంప్రసాద్, మాజీ ఎంపీటీసీ నరేందర్, దనలక్ష్మీకృష్ణ, బాల్‌రాజ్,కరుణాకర్, బీమ్ సింగ్ పాల్గొన్నారు.

రాయపోల్ ట్రాన్స్‌కో ఏఈగా శ్రీనివాస్‌రావు

రాయపోల్,అక్టోబర్ 18 : రాయపోల్ మండల ట్రాన్స్‌కో ఏఈగా పల్లా శ్రీనివాస్ రావు శుక్రవారం విద్యుత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఇక్కడ ఇన్‌చార్జి విద్యుత్ ఏఈగా పనిచేసిన మహాదేవుల సత్యం కొండపాక ఏఈగా వెళ్లారు. ఈ సందర్భంగా ఏఈగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రావు విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ సమస్యలు లేకుండా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్ ఉద్యోగులు ఏఈగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌రావును సన్మానించారు.

వైకుంఠ రథం బహూకరణ

జంగపల్లిలో జెండా ఊపి వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై హరీశ్

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 18 : మనిషి బతికి ఉన్నప్పుడు ఎలా గౌరవిస్తారో మృతి చెందిన తర్వాత శవ అంత్యక్రియలు కూడా అంతే గౌరవ పథంగా నిర్వహించాలని భూంపల్లి ఎస్సై వి.హరీశ్, జంగపల్లి మాజీ సర్పంచ్ కంచం యాదగిరి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన కంచం భూలక్ష్మీరాజయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గ్రామానికి సొంత ఖర్చులతో తయారు చేసిన వేకుంఠరథాన్ని శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెల్లో ఇలాంటి మంచి పనులు చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. మాజీ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్లేశంగౌడ్, వెంకట్ రెడ్డి, అంజయ్య, యాదగిరి, గణేశ్, రమేశ్, అనిల్, జ్యోతి గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 18 : కార్పొరేట్ విద్యా విధానంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు.లయన్స్ క్లబ్,ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'మానసిక ఆరోగ్యం' అనే అంశంపై జూనియర్ కళాశాల విద్యార్థులు,కౌన్సిలర్లకు ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. మానసిక వైద్యురాలు పావనీసంధ్య, ప్రముఖ మానసిక నిపుణులు డాక్టర్ మామిడాల శ్రీనివాస్ విద్యార్థుల్లో మానసిక రుగ్మతలు, ఒత్తిడిని అధికమించేందుకు కౌన్సిలర్లు చేయాల్సిన అంశాలను వివరించారు.రాజన్నసిరిసిల్ల జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీనివాస్,కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు హరిబాబు,మహేందర్, రాజు, సత్యానందం పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

చేర్యాల, అక్టోబర్ 18 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని, హామీల అమలు కోసం ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి తెలిపారు .మండలంలోని చుంచనకోటలో సీపీఎం గ్రామ మహాసభ బోడిగం నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగింది. అనంతరం గ్రామ కార్యదర్శిగా పండుగ యాదగిరి, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కర్రె బాలరాజును ఎన్నుకున్నారు.సమావేశంలో మండల,పట్టణ కార్యదర్శులు వెంకట్‌మావో, నాగరాజు, నాయకులు బోయిన మల్లేశం, గొర్రె శ్రీనివాస్, ఎండీకరీం, రేపాక కుమార్, మల్కని ఎల్లయ్య, రవీందర్, శోభ, మంజుల, బాలమణి, సుజాత పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, అక్టోబర్ 18: మహిళా సంఘాలు ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఇంద్ర మహిళా శక్తి స్కీంలో భాగంగా బ్యాంకు అందజేసిన రుణాలతో మహిళలు తయారు చేసే జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తయారీ విధానంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మార్కెట్‌లో డిమాండ్ కలిగిన వాటినే ఎక్కువగా తయారు చేసే విధంగా చూడాలన్నారు.

చెడు ఆలోచనలకు తావియ్యకూడదు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 18 : అవసరమైన మేరకు మాత్రమే సోషల్ మీడియాను ఉపయోగించాలని, చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదని సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి ఆమె అవగాహన కల్పించారు.ప్రధానోపాధ్యాయురాలు అస్మా ఫాతిమా, అధ్యాపకులు, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'ఆయిల్‌పామ్'పై అవగాహన

నంగునూరు, అక్టోబర్ 18 : మండలంలోని నర్మెటలో తెలంగాణ ఆయిల్‌పామ్ కర్మాగారంలో శనివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అధ్యక్షతన ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, ఆయిల్‌పామ్ రైతు వెల్ఫేర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

చేర్యాల, అక్టోబర్ 18 : మండలంలోని చుంచనకోట గ్రామానికి చెందిన శ్రీపతి శోభ (50) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందింది. నిరుపేద కుటుంబానికి చెందిన శోభ కుటుంబాన్ని ఆదుకుందామని యువజన నాయకుడు రమేశ్ 'చుంచనకోట ముచ్చట్లు' అనే వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశాడు. దీనికి స్పందించి గ్రూపు సభ్యులు రూ.40వేలను మృతురాలి కుటుంబానికి అందజేశారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట, అక్టోబర్ 18: ప్రతి విద్యార్థికీ చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమేనని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలో మల్టీపర్పస్ హైస్కూల్ మైదానంలో సిద్దిపేట జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ జిల్లా స్థాయి క్రీడా పోటీలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన క్రీడాజ్యోతిని వెలిగించి పతాకావిష్కరణ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు రోజూ గంట సమయాన్ని క్రీడలకు కేటాయించాలన్నారు. జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలుపాలన్నారు. క్రీడా పోటీలకు చక్కటి ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌ను అభినందించారు. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతినిత్యం సాధన చేయడం వల్ల క్రీడల్లో రాణిస్తారన్నారు. గెలుపు ఓటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్య మాట్లాడుతూ రెండు రోజులపాటు అండర్- 14, 17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు జిల్లా వ్యాప్తంగా 2500 మంది క్రీడాకారులు, 150 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటున్నారన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బందికి భోజనం సమకూర్చిన వంగా మహేందర్‌రెడ్డిని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మల్టీపర్పస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ రామేశ్వర్‌రెడ్డి, పెటా టీఎస్ అధ్యక్షుడు తోట సతీవ్, టీజీ పేటా జిల్లా అధ్యక్షుడు ఏర్వ అశోక్, వ్యాయామ ఉపాధ్యాయులు కాటం శ్రీనివాస్, వెంకటస్వామి, సుజాత, భిక్షపతి, రమణారెడ్డి, మురళీధర్, నవీన్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు ప్రక్రియలో పాల్గొన్న మహేందర్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 18 : ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి ఆశీర్వదిస్తే.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఓటరు సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

దుబ్బాక,అక్టోబర్18: కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగం మహేందర్‌రెడ్డికి మద్దతుగా దుబ్బాకలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. నాయకులు మద్దుల లక్ష్మారెడ్డి, గడ్డం స్వామి, బాలకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట, అక్టోబర్ 18: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ ఆన్‌లైన్ దరఖాస్తులకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లాగిన్ల ద్వారా ఆన్‌లైన్ చేయడం వల్ల ఎక్కువ సమయం పడుతుందని, మరో 29 లాగిన్లను ప్రత్యేకంగా క్రియేట్ చేయించడం జరిగిందన్నారు. మొత్తం 32,533 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఒక్కొక్కరికి వెయ్యి దరఖాస్తులు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. సీపీవో వందనం, టీపీవ నస్రీన్‌భాను, టీపీఎస్ స్రవంతి పాల్గొన్నారు.

భారతిస్వామి జయంతి



భావానంద భారతి స్వామికి చెప్పన్ భోగ్ నివేదన చేస్తున్న భక్తులు

మర్కూక్,అక్టోబర్18: మర్కూక్ మండలం పాండురంగాశ్రమంలో శుక్రవారం యతివర భావానంద భారతిస్వామి 125వ జయంతి వైభవంగా జరిగింది. ఉదయం పల్లకీసేవ క్షేత్ర ప్రదక్షిణతో ఉత్సవాలు మొదలయ్యాయి. భక్తులు విఠల నామస్మరణలతో ఆశ్రమం మార్మోగింది. గురుపాదుకా పూజలో భాగంగా పంచసూక్తములు సమక చమకాలతో స్వామివారి పాదుకలు,సమాధికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తీసుకువచ్చిన 56 రకాల మధుర పదార్థాలతో స్వామివారికి చెప్పన్ భోగ్ నివేదన వైభవంగా నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తులకు నిర్వాహకులు భోజన ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జెండా పండుగ

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 18: హుస్నాబాద్ జామా మసీదు ఆధ్వర్యంలో శుక్రవారం గౌసేపాక్ గ్యార్మీషరీఫ్(జెండా పండుగ)ను నిర్వహించారు. ఆరువందల మంది ముస్లింలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జామా మసీదు కమిటీ అధ్యక్షుడు ఎండీ భాషుమియా, ప్రధాన కార్యదర్శి ఎండీ హసన్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఆయూబ్, ఎండీ దస్తగిరి, ఎండీ అప్జల్, షబ్బీర్, అక్బర్ పాల్గొన్నారు.

సిద్దిపేట రైతు బజారులో రూ.10 కాయిన్స్ మేళా

సిద్దిపేటలో పది రూపాయల నాణెలను పంపిణీ చేస్తున్న బ్యాంకు అధికారులు

సిద్దిపేట, అక్టోబర్ 18: పది రూపాయల నాణెల వాడకంపై ఎలాంటి అపోహలు వద్దని, అవి చలామణిలోనే ఉన్నాయని లీడ్ బ్యాంక్ మేనేజర్ బి.హరిబాబు అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని రైతు బజారులో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో పది రూపాయల కాయిన్స్ మేళా నిర్వహించారు. లక్ష రూపాయలకు సరిపడా పది రూపాయల నాణెలను యూనియన్ బ్యాంక్ వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సురేశ్, ఎస్‌బీఐ అధికారి రవి పాల్గొన్నారు.

డివిజన్ కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ పరమేశ్వర్

చేర్యాల, అక్టోబర్ 18 : చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఐక్యంగా పోరాడుతామని జేఏసీ చైర్మన్ డా.ఆర్.పరమేశ్వర్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం రెవెన్యూ డివిజన్ సాధన కోసం జేఏసీ వైస్ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ కేంద్రాన్ని సాధించేందుకు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు, ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. నాయకులు కామిడి జీవన్‌రెడ్డి, అందె అశోక్, ఉడుముల భాస్కర్‌రెడ్డి, అందె బీరయ్య, మల్లిగారి యాదయ్య, ఒగ్గు రాజు, అవుశర్ల యాదయ్య, బస్వగళ్ల సిద్ధయ్య, దాసరి శ్రీకాంత్, ఆడెపు నరేందర్, పాల లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మహ్మదాపూర్‌లో రాములు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సతీశ్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్/ అక్కన్నపేట,అక్టోబర్ 18 : హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్‌లో పిట్టల రాములు ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా శుక్రవారం ఆయన కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పరామర్శించారు. అక్కన్నపేట మండలంలోని పోతారం(జే)లో శిఖ కీర్తన్య విద్యుత్ షాక్‌తో మరణించగా చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు.

పలు కుటుంబాలకు పరామర్శ

హుస్నాబాద్, అక్టోబర్ 18: హుస్నాబాద్ పట్టణంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పరామర్శించారు. పట్టణంలోని ఆరెపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సొల్లు రాజమల్లు భార్య అనంతలక్ష్మి మృతి చెందగా రాజమల్లుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ జడ్పీటీసీ మంగ, మార్కెట్ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, నాయకులు కె. రవి, బొజ్జ హరీశ్, శ్రీనివాస్, కందుకూరి సతీశ్, రవి, సదానందం ఉన్నారు.

రేపు సర్వీస్ రూల్స్ పై కొత్త టీచర్లకు అవగాహన

సిద్దిపేట కమాన్, అక్టోబర్ 18 : డీఎస్సీ 2024 ద్వారా జిల్లాలో నియామకమైన 256 మంది ఉపాధ్యాయులకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్వీస్ రూల్స్ పై అవగాహన సదస్సు ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి తెలిపారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భారత్‌నగర్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం, హనుమాన్ నగర్ ప్రాథమిక పాఠశాల, రంగధాంపల్లి ఉన్నత పాఠశాలలోని నూతన ఉపాధ్యాయులను కలిసి అవగాహన సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన వక్తగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు బి.రాకేశ్, ఎండీ ఇస్మాయిల్, ఎం.కనకరాజు, ఎండీ లతీఫ్, నూతన ఉపాధ్యాయులు నరేశ్, శ్రీకాంత్, అన్వేషిత, ఉమేరాబేగం పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనల వెల్లువ

దుబ్బాక, అక్టోబర్18: పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీల్లో లచ్చపేట మోడల్‌స్కూల్ (ఆదర్శ పాఠశాల) విద్యార్థులు పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు తెలిపారు. ఆరు విభాగాల్లో నిర్వహించిన (జిల్లా స్థాయి పోటీల్లో) పలు పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఇందులో టెన్త్ చదువుతున్న చామంతి ఏకపాత్రాభినయంలో, యశ్వంత్ వాద్య సంగీతంలో ,క్రాంతికుమార్ చిత్రలేఖనంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం ఎంఈవో ప్రభుదాస్, పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

రూ.2 లక్షల పంటరుణమాఫీ అమలు చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న రైతు రక్షణ సమితి నాయకులు

సిద్దిపేట కమాన్, అక్టోబర్ 18 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు తక్షణమే రూ.2 లక్షల పంటరుణమాఫీ అమలు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రామలింగారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం అధికారులకు వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. పంటరుణమాఫీ, పెట్టుబడి సహాయం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రెండు పంటల పెట్టుబడి సహాయం వెంటనే అందించి ఆదుకోవాలన్నారు. కొంత మందికి పంటరుణమాఫీ కాకపోవడం.. బ్యాంకుల్లో అప్పులు దొరకక అధిక వడ్డీలకు అప్పులు తెస్తున్నారన్నారు. వడ్డీలు కట్టలేక మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు దారితీసే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, పన్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, యాదవ్‌రావు, పాతూరి వెంకట్ రెడ్డి (మందపల్లి), మోసర్ల మధుసూదన్‌రెడ్డి, రాజనర్సయ్య, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్18: మద్దూరు మండలంలోని మర్మాములలోని జూదం స్థావరంపై గురువారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఎస్సై షేక్ మహబూబ్ మాట్లాడుతూ ఇప్ప నిష్కాంత్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో కొంతమంది జూదం ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు మద్దూరు పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఇప్ప నిష్కాంత్‌రెడ్డి(మర్మాముల), వంగ రమేశ్(హైదరాబాద్), ఉప్పునూరి శ్రీధర్(చేర్యాల), గాజుల యాదగిరి(మర్మాముల) లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ. 16,990 నగదు, రెండు కార్లు, మూడు బైక్‌లు, ఐదు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఆయన వివరించారు.

ఉచితంగా పుస్తకాలు పంపిణీ

మర్కూక్,అక్టోబర్18: మండల కేంద్రంలో